రక్త పరీక్షలకు భర్త ఒప్పుకోలేదని..

ఉరేసుకుని భార్య ఆత్మహత్య

జూలపల్లి, మార్చి 22 : తన భర్త రక్త పరీక్షలు చేయించుకోవడంలేదని మనస్తాపం చెందిన ఓ భార్య పురుగుల మందు తాగి, ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం తెలుకుంటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా .. గ్రామానికి చెందిన మేకల పద్మ (48) భర్త తిరుపతి బతుకు దెరువు కోసం 13 ఏండ్ల క్రితం మలేషియా వెళ్లి తిరిగి స్వగ్రామానికి వచ్చి, నెల రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. పెద్దపల్లిలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స తీసుకున్నా జ్వరం తగ్గక పోవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లగా క్షయ వ్యాధి ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో మరికొన్ని రక్త పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించగా నిరాకరించాడు. ఎంత చెప్పినా రక్త పరీక్షలు చేయించుకోకపోవడంతో మనస్తాపం చెందిన పద్మ పురుగుల మందు తాగి, ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుంది. భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ వివరించారు

సన్నీ యాదవ్‌పై లుక్‌ఔట్ నోటీసు

సూర్యాపేట టౌన్, మార్చి 22 : బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల కేసులో యూ ట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్, అంతర్జాతీయ బైక్ రైడర్ బయ్యా సన్నీ యాదవ్‌పై సూర్యాపేట జిల్లా పోలీసులు లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల విషయంలో ఈ నెల 5న సూర్యాపేట జిల్లా నూతనకల్ పోలీసు స్టేషన్‌లో సన్నీ యాదవ్‌పై కేసు నమోదైంది. విచారణలో భాగంగా సన్నీ యాదవ్ విదేశాల్లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేసినట్లు సూర్యాపేట డీఎస్పీ రవి తెలిపారు. సన్నీ యాదవ్ వాఘా సరిహద్దు గుండా పాకిస్తాన్ దేశంలోకి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. భారత్‌లోకి అడుగు పెట్టగానే ఇమ్మిగ్రేషన్ అధికారుల ద్వారా సన్నీని అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. పోలీసులు ఇప్పటికే పలువురు ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదు చేశారు.

బీజేపీలో కుర్చీలాట

- రాష్ట్ర అధ్యక్ష పదవిపై పీటముడి
- రేసులో లేను.. ఇస్తే వద్దనను అనేలా బండి వ్యాఖ్యలు
- రాష్ట్ర నాయకత్వం నిర్ణయిస్తే రబ్బర్ స్టాంపే: రాజాసింగ్
- తెరపైకి రోజుకో కొత్త పేరు.. ఎటూ తేల్చని అధిష్ఠానం

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి 'మ్యూజికల్ చైర్' ఆటను తలపిస్తున్నది. పదవిని ఆశిస్తున్న రేసుగుర్రాల జాబితాలో రోజుకో కొత్త పేరు వచ్చి చేరుతున్నది. అసలు నేతలు, వలస నేతలంటూ పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఇక అధిష్ఠానం సైతం అదిగో.. ఇదిగో అంటూ నాన్చుతున్నది. దీంతో ఎవరికి వారు వర్గాలుగా విడిపోయిన కీలక నేతలు రాష్ట్ర అధ్యక్షపదవి కోసం కుమ్ములాటలకు దిగుతున్నారు. ఒకరి అవకాశాలను మరొకరు దెబ్బతీయడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇటీవల కొత్త ఎమ్మెల్సీలతో భేటీ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్టీ నేతలను గట్టిగా మందలించినట్టు తెలిసింది. 'మీరు ఉన్నదే కొద్ది మంది. చేస్తే మంచి రాజకీయాలు చేయండి. లేదంటే వెళ్లిపోండి. మేం కొత్త నాయకత్వం తయారుచేసుకుంటం' అని ఓ స్థాయిలో క్లాస్ పీకినట్టు సమాచారం. అక్కడ తలూపిన నేతలు మళ్లీ రాష్ట్రానికి రాగానే ఎవరికి వారే అన్నట్టు వ్యవహరిస్తున్నారు.

అగ్గిరాజేసిన రాజాసింగ్, బండి

బీజేపీలో ఇద్దరు కీలక నేతలు మంటలు రాజేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్ శనివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ 'నేను అధ్యక్ష రేసులే లేను' అంటూనే 'అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా అమలు చేయడమే క్రమశిక్షణ కలిగిన బీజేపీ కార్యకర్తల పని' అంటూ మనసులో మాట బయటపెట్టుకున్నారు. 'కొంతమంది అధ్యక్షులం అవుతున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు ఇది పార్టీ క్షమశిక్షణకు వ్యతిరేకం, కార్యకర్తలను కన్ఫ్యూజ్ చేయొద్దు' అంటూ మరో వర్గానికి హెచ్చరికలు పంపించారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడం వెనుక శ్రమ అంతా తనదేనంటూ బండి ఢిల్లీ పెద్దల ముందు చెప్పుకున్నట్టు తెలిసింది.

రాష్ట్రకమిటీ నిర్ణయిస్తే రబ్బర్ స్టాంపే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని ఫైనల్ చేసేది రాష్ట్ర కమిటీనా, లేక జాతీయ కమిటీనా అని ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. ఒక వేళ రాష్ట్ర కమిటీ ఎంపిక చేస్తే కొత్త అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ నుంచి పాత సామాన్లను బయటపడేయాలని అన్నారు. గతంలో పనిచేసిన అధ్యక్షుడు గ్రూప్ రాజకీయాలు చేసి పార్టీకి నష్టం చేశారని చెప్పారు. కొత్త బీజేపీ అధ్యక్షుడు అదే గ్రూపిజం చేస్తే పార్టీకి నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఫ్రీహ్యాండ్ ఇస్తే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని జోస్యం చెప్పారు. కొత్త అధ్యక్షుడు వచ్చిన తర్వాత ముఖ్యమంత్రితో రహస్య భేటీలు నిర్వహించవద్దని హితవు పలికారు. పార్టీలో పెద్దల దృష్టికి తీసుకువచ్చినా వినకపోవడం వల్లే ప్రజల ముందు పెడుతున్నానని వివరించారు.

మోదీ చుట్టూ ప్రదక్షిణలు..

రాష్ట్ర అధ్యక్షపదవిని ఆశిస్తున్న వారంతా ప్రధానమంత్రి మోదీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇటీవలే కుటుంబంతో సహా వెళ్లి కలిసొచ్చారు. కానీ రాష్ట్రానికి చెందిన వారే ఈటలకు అధ్యక్ష పదవికి రాకుండా అడ్డుకున్నారన్నది ఆ పార్టీలో బహిరంగ రహస్యం. ఆ వెంటే మెదక్ ఎంపీ రఘునందనరావు సైతం కుటుంబంతో సహా మోదీని కలిశారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మొదటి నుంచి తనకు రాష్ట్ర అధ్యక్షపదవి ఇవ్వాలని కోరుతున్నారు. ధర్మపురి అర్వింద్ సైతం పోటీపడుతున్నారు. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు చాలాకాలంగా ఆ పదవిపై ఆశ పెట్టుకున్నారు. కొత్తగా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పొల్సాని మురళీధర్‌రావు పేరు తెరపైకి వచ్చింది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- అన్యాయంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించారు
- వైద్యం కోసమే అమెరికాలో ఉన్నా
- నా వివరాలన్నీ అధికారికి ఇచ్చా
- ఏ రాజకీయ పార్టీతో నాకు సంబంధం లేదు
- కోర్టును ఆశ్రయించిన ప్రభాకర్‌రావు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోసం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టీ ప్రభాకర్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. తాను 65 ఏండ్ల సీనియర్ సిటిజన్‌నని, తన వయసుతోపాటు అనారోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. తాను ఎక్కడికి పారిపోలేదని, వైద్యం కోసమే అమెరికాకు వెళ్లానని, ఇదే విషయాన్ని గతంలో కింది కోర్టుకు తెలిపానని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు తనను ప్రధాన నిందితుడిగా చేర్చారని, నిజానికి ఆ వ్యవహారంతో తనకు ఏమాత్రం సంబంధం లేదని, అయినప్పటికీ కొందరి నేరాంగీకార వాంగ్మూలాల ఆధారంగా తనపై తప్పుడు కేసు నమోదు చేశారని చెప్పారు. ఈ కేసులో అరెస్ట్ కాకుండా తప్పించుకునేందుకే తాను విదేశానికి పారిపోయినట్టు దర్యాప్తు సంస్థ కింది కోర్టుకు చెప్పి నాన్-బెయిలబుల్ వారెంట్ ఉత్తర్వులు పొందిందని వివరించారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, ఎస్ఐబీ చీఫ్‌గా నిబంధనలకు లోబడి నిబద్ధతతో పనిచేశానని తెలిపారు. అధికారిక పార్టీతో కుమ్మక్కై ఇతర పార్టీల నాయకుల ఫోన్లను ట్యాప్ చేయించానన్నది అసత్యమని, అది తప్పుడు ఆరోపణ అని స్పష్టం చేశారు. ప్రస్తుతం తాను అమెరికాలో ఉన్నప్పటికీ దర్యాప్తు అధికారితో సంప్రదిస్తూనే ఉన్నానని, తన వివరాలన్నీ దర్యాప్తు అధికారికి అందజేశానని చెప్పారు. తాను అమెరికా వెళ్లాక దర్యాప్తు అధికారులు తన నివాసంలో సోదాలు జరిపినప్పటికీ వారికి ఎలాంటి ఆధారాలు లభించలేదని, తాను తప్పు చేసినట్టు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ఇప్పటికే పూర్తవడంతో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారని, ఆ రికార్డుల్లోని విషయాలు తప్ప కొత్తగా సేకరించాల్సిన అంశాలేమీ లేవని, అయినప్పటికీ దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పోలీసులు తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టనున్నది.

ఉద్యోగుల కులాల సేకరణకు చర్యలు

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్నిశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కులాల వివరాలు సేకరించేందుకు చర్యలు చేపట్టినట్టు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం పలు కులాల పేర్ల మార్పులను చేపట్టాలని బీసీ కమిషన్ గతంలోనే నిర్ణయించింది. అందులో భాగంగా 26న వేములవాడ, 27న సిరిసిల్లలో బీసీ కమిషన్ పర్యటించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన ఫీల్డ్ విజిట్స్‌ను తిరిగి చేపట్టినట్టు తెలిపారు. స్కూల్, ఇంటర్మీడియట్, హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్లు, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నుంచి కులాల వారీగా విద్యార్థులు, ఉద్యోగుల కులాల వివరాలు సేకరించేందుకు చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు.

గ్రామాల్లో జీపీవోల పాలన!

- 10,954 గ్రామ పాలన ఆఫీసర్ల భర్తీకి సర్కారు నిర్ణయం

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): గ్రామాల్లో గ్రామ పాలన అధికారుల (జీపీవో)ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 10,954 విలేజ్ లెవల్ ఆఫీసర్స్ పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. గ్రామ పరిపాలనను బలోపేతం చేసేందుకు వీరిని నియమించనున్నట్టు పేర్కొంది. జీపీవోగా పనిచేసేందుకు గతంలో పనిచేసిన వీఆర్వో, వీఏవోల నుంచి ఆప్షన్లు కోరనుంది. ఆసక్తి చూపిన వారిని జీపీవోలుగా నియమించనుంది. దీంతో జీపీవోలుగా మళ్లీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు (వీఆర్వో) రాబోతున్నారు. జీపీవోల విధివిధానాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. త్వరలోనే విధివిధానాలను జారీ చేయనున్నది. జీపీవో పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ జేఏసీ హర్షం వ్యక్తంచేసింది. ఈ మేరకు జేఏసీ నేతలు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈబీసీలకూ 'రాజీవ్ యువ వికాసం'

హైదరాబాద్, మార్చి22 (నమస్తే తెలంగాణ): ఆర్థికంగా వెనుకబడిన తరగతులు(ఈబీసీ), ఆర్థికంగా బలహీనవర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందిన వారికి సైతం 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని వర్తింపజేస్తున్నారు. బీసీ సంక్షేమశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన వ్యక్తులు ఆర్థిక సాయం కోసం ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5లోగా https://tgobmmsnew.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

బీసీ స్కాలర్‌షిప్‌కు 12.34 కోట్లు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): బీసీ విద్యార్థులకు సంబంధించి ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ప్రభుత్వం రూ.12.34 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్ఎల్‌బీసీ సహాయక చర్యలకు 5 కోట్లు..

ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాద ఘటనకు సంబంధించి చేపట్టిన సహాయక చర్యల కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. గత నెల 22 ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఇన్‌లెట్ వైపు 13.85 కి.మీటర్ వద్ద సొరంగం కూలిపోవడం, ఈ ఘటనలో 8 మంది మృతిచెందిన విషయం తెలిసిందే

మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర వర్గీయులు

మాదిగలపై కడియం వివక్ష

- స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంపై సీఎం దృష్టిసారించాలి
- టీపీసీసీ కార్యదర్శి సింగపురం ఇందిర వర్గీయుల డిమాండ్

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 22 : అధికార పార్టీకి చెందిన దళితులను కాదని కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన వారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రాధాన్యమిస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర వర్గీయులు ఆరోపించారు. శనివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో దళితుల జనాభా 85 వేలుంటుందన్నారు. ఇందులో అత్యధికులు మాదిగలు కావడంతో ఎమ్మెల్యే శ్రీహరి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. కడియం పార్టీలోకి వచ్చాక తమపై ఆధిపత్యం చెలాయిస్తున్న విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాగా కాంగ్రెస్ సీనియర్ నాయకులమైన తమకు కడియం స్టేజి పాస్‌లు ఇవ్వకుండా అవమాన పరిచారని గుర్తుచేశారు.

ఎప్‌సెట్ టెస్ట్ సెంటర్లు బ్లాక్

- సామర్థ్యం సరిపోక కొత్తగా దరఖాస్తు చేసేవారికి హైదరాబాద్‌లో సెంటర్లు
- ఆదిలాబాద్ వాళ్లైనా, గద్వాలకు చెందిన వాళ్లైనా హైదరాబాద్‌లో పరీక్ష రాయాల్సిందే

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : మీరు ఎప్‌సెట్‌కు కొత్తగా దరఖాస్తు చేస్తున్నారా..? రాష్ట్రంలో ఎక్కడివారైనా హైదరాబాద్‌కు పరుగెత్తాల్సిందే. ఆపసోపాలు పడుకుంటూ హైదరాబాద్‌లో పరీక్ష రాయాల్సిందే. ఎప్‌సెట్‌లోని 12 టెస్ట్ జోన్లను జేఎన్టీయూ అధికారులు బ్లాక్ చేశారు. ఈ 12 టెస్ట్ జోన్లల్లో సెంటర్ల సామర్థ్యం మేరకు దరఖాస్తులొచ్చాయి. దీంతో కొత్తగా దరఖాస్తు చేసే వారికి ఆయా టెస్ట్‌జోన్లల్లో సెంటర్లు కేటాయించలేని పరిస్థితి నెలకొన్నది. ఎప్‌సెట్‌కు కొత్తగా ఎవరు దరఖాస్తు చేసినా హైదరాబాద్‌లోనే సెంటర్లను కేటాయిస్తారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్‌లో సెంటర్ల కేటాయింపు సమస్యగా మారింది. జిల్లాల నుంచి భారీగా దరఖాస్తులు రావడంతో ఎప్‌సెట్ పరీక్షలు నిర్వహించే సెంటర్లు హౌజ్‌ఫుల్ అయ్యాయి. దీంతో శనివారం వరకు రాష్ట్రంలోని 12 టెస్ట్ జోన్లను జేఎన్టీయూ అధికారులు బ్లాక్ చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే వారికి ఈ టెస్ట్ జోన్లు అందుబాటులో లేకుండా చేశారు. ఈ జోన్లల్లో సెంటర్ల సామర్థ్యం తక్కువగా ఉండటం, ఇప్పటికే దరఖాస్తులు భారీగా రావడంతో ఆయా టెస్టు జోన్లను బ్లాక్‌చేశారు. తాజా సమాచారం ప్రకారం ఒక్క హైదరాబాద్ మినహా ఎక్కడా సెంటర్లు కేటాయించలేని పరిస్థితి నెలకొన్నది.

సామర్థ్యం పెంపునకు ప్రయత్నాలు..

టెస్ట్ జోన్లను బ్లాక్ చేయాల్సి రావడం, ఇంకా దరఖాస్తు చేసుకునే అవకాశముండటంతో టెస్ట్ సెంటర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఏప్రిల్ 4 వరకు ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసే అవకాశమున్నది. రూ. 250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 9, రూ. 500తో ఏప్రిల్ 14, రూ. 2,500తో ఏప్రిల్ 18, రూ. 5వేలతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసే అవకాశమున్నది. పైగా ఇంటర్ వార్షిక పరీక్షలు ముగిశాయి. దీంతో దరఖాస్తులు పెరగనున్నాయి. సెంటర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు జేఎన్టీయూ అధికారులు ప్రయత్నిస్తున్నారు. శనివారం వరకు ఎప్‌సెట్‌కు 1,75,991 దరఖాస్తులొచ్చాయి. ఇంజినీరింగ్‌లో 1,27,758, అగ్రికల్చర్, ఫార్మసీకి 48,115, రెండింటికి హాజరయ్యేందుకు 118 మంది చొప్పున దరఖాస్తు చేసుకున్నారు.

బ్లాక్ చేసిన ప్రాంతాలు

నర్సంపేట, హసన్‌పర్తి, హనుమకొండ, వరంగల్, నిజామాబాద్, ఆర్మూర్, ఆదిలాబాద్, నర్సాపూర్, సుల్తాన్‌పూర్, పటాన్‌చెరు, రుద్రారం, జగిత్యాల, కరీంనగర్, హుజురాబాద్, మంథని, సిద్దిపేట, నల్లగొండ, కోదాడ, సూర్యాపేట, ఖమ్మం, పాల్వంచ, సుజాతనగర్, సత్తుపల్లి, మహబూబ్‌నగర్.

లా కోర్సుల్లో ఫీజుల మోత

- గరిష్ఠ ఫీజు రూ.42 వేలకు పెంపు
- ఫీజులు ఖరారు చేసిన టీఏఎఫ్ఆర్సీ

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): న్యాయవిద్య కోర్సుల ఫీజులు పెరిగాయి. మూడేండ్ల లా కోర్సు గరిష్ఠ ఫీజును రూ.42 వేలు, కనిష్ఠ ఫీజును రూ.20వేలుగా టీఏఎఫ్ఆర్సీ ఖరారు చేసింది. 2025-28 మూడేండ్ల కోర్సు ఫీజులను ఖరారు కోసం టీఏఎఫ్ఆర్సీ శనివారం విచారణ జరిపి, ఈ మేరకు పెంపుపై నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 22 న్యాయ కళాశాలలున్నాయి. వీటిలో మూడేండ్ల, ఐదేండ్ల కోర్సులను అందిస్తున్నాయి. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ఫీజు ఖరారుపై టీఏఎఫ్ఆర్సీ ఈ నెల 24 నుంచి 26 వరకు విచారణ జరపనుంది. దాదాపు 130 కాలేజీలు 15శాతం ఫీజు సవరణకు దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తున్నది.

పెరిగిన వివిధ కోర్సుల ఫీజులు

కోర్సు	గరిష్ఠ ఫీజు	కనిష్ఠ ఫీజు
మూడేండ్లలా	రూ.36వేల నుంచి 42వేలకు పెంపు	రూ.20వేలు(యథాతథం)
ఐదేండ్ల లా	రూ.36వేల నుంచి 42వేలకు పెంపు	రూ.20వేలు(యథాతథం)
ఎంబీఏ, ఎంసీఏ	15శాతం పెంపునకు ప్రతిపాదనలు	15శాతం పెంపునకు ప్రతిపాదనలు
ఫైన్‌ఆర్ట్స్ ఆర్కిటెక్చర్	పాత ఫీజులు యథాతథం	పాత ఫీజులు యథాతథం

ఒక్క కేజీబీవీని అప్‌గ్రేడ్ చేయలే!

- 212 కేజీబీవీలు ఇంకా పదో తరగతి వరకే..
- బాల్య వివాహాలకు ఆస్కారమిస్తున్న సర్కారు తీరు
- 283 కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేసిన బీఆర్ఎస్ సర్కార్

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : ఎందరో నిరుపేద, నిరాశ్రిత బాలికలను అక్కున నేర్చుకున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను(కేజీబీవీల) కాంగ్రెస్ సర్కారు గాలికొదిలేసింది. 15 నెలల పాలనలో ఒక్కటంటే ఒక్క కేజీబీవీని ఇంటర్ వరకు అప్‌గ్రేడ్‌చేయలేదు. దీంతో బాల్యవివాహాలకు దారితీస్తున్నది. లేదంటే పైచదువుల కోసం బాలికలు ఇంటర్ చదువులకు ఇతరదారులు వెతుక్కోవాల్సి వస్తున్నది. రాష్ట్రంలో మొత్తం 495 కేజీబీవీలున్నాయి. పదో తరగతి వరకు గల ఈ కేజీబీవీలను గత బీఆర్ఎస్ సర్కారు ఇంటర్ వరకు అప్‌గ్రేడ్‌చేసింది. దశలవారీగా 283 కేజీబీవీల స్థాయిని పెంచి, బాలికలకు నాణ్యమైన విద్యనందించింది. ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసిన కేజీబీవీల్లో రెగ్యులర్ కోర్సులతోపాటు వొకేషనల్ విద్యనందించింది. దీంతో కేజీబీవీలపై క్రేజ్ వాతావరణం నెలకొన్నది. అయితే మరో 212 కేజీబీవీలను 10వ తరగతి వరకే నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క కేజీబీవీని కూడా అప్‌గ్రేడ్ చేయలేదు. కేజీబీవీల వాతావరణానికి అలవాటుపడిన బాలికలు పదో తరగతి తర్వాత జూనియర్ కాలేజీల్లో సర్దుబాటుకాలేకపోతున్నారు. డ్రాపౌట్ అవుతున్నారు. ఇక పదో తరగతి పూర్తికాగానే చదువుల భారం భరించలేక కుటుంబసభ్యులు వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు తీరు బాల్యవివాహాలకు ఆస్కారమిస్తున్నది.

రూ.105కోట్లివ్వండి

కేజీబీవీలను సమగ్రశిక్ష ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా నిర్వహిస్తున్నారు. ఏటా నిర్వహించే ఎస్ఎస్ పీఏబీ సమావేశంలో కేజీబీవీల అప్‌గ్రేడేషన్‌కు ఆమోదం తెలుపుతారు. కానీ 2024-25 విద్యాసంవత్సరంలో ఒక్క కేజీబీవీని కూడా అప్‌గ్రేడ్ చేయలేదు. 2025-26 విద్యాసంవత్సరంలో 30 వరకు కేజీబీవీల అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదనలు సమావేశం ముందుంచారు. కానీ ఏదీ తేలలేదు. 212 కేజీబీవీలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్‌చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సర్కారుకు ప్రతిపాదనలు పంపించింది. కేంద్ర ప్రభుత్వంతో సంబంధంలేకుండా రాష్ట్ర ప్రభుత్వమే అప్‌గ్రేడ్‌చేయాలని, ఇందుకు రూ.105 కోట్లు ఖర్చవుతాయని ప్రతిపాదించింది. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా సమకూర్చాలని కోరింది. ఇందుకు సర్కారు పచ్చ జెండా ఊపుతుందా.. లేక మోకాలడ్డుతుందా అన్న అనుమానాలు నెలకొన్నాయి.

బీఆర్ఎస్ పాలనలో ఇంటర్ వరకు అప్‌గ్రేడేషన్ తీరు

సంవత్సరం	అప్‌గ్రేడ్ చేసినవి
2018-19	84
2019-20	88
2021-22	36
2022 -23	37
2023-24	38
మొత్తం	283

ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఎస్పీ మృతి

లక్ష్మారెడ్డిపాలెం వద్ద రోడ్డు దాటుతుండగా ఘటన

హయత్‌నగర్, మార్చి 22 : వాకింగ్ కోసం వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అడిషనల్ ఎస్పీ మృతిచెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకున్నది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లక్ష్మారెడ్డిపాలెంలో నివాసముంటున్న అడిషనల్ ఎస్పీ టీఎం నందీశ్వర్‌బాబ్జీ(50) డీజీ పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున నందీశ్వర్ బాబ్జీ లక్ష్మారెడ్డిపాలెం వద్ద హనుమాన్ టెంపుల్ సమీపంలో వా కింగ్ చేసేందుకు విజయవాడ జాతీయ రహదారిని దాటుతున్నాడు. అదే సమయంలో ఏపీలోని నూజివీడు డిపోకు చెందిన బస్సు(ఏపీ39 వీఏ 9563) అబ్దుల్లాపూర్‌మెట్ వైపు నుంచి హయత్‌నగర్ వైపు అతివేగంగా వచ్చి నందీశ్వర్‌బాబ్జీని ఢీకొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాబ్జీ అక్కడికక్కడే మృతిచెందాడు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని పదో తరగతి విద్యార్థిని మృతి

- పరీక్ష రాసి బైక్‌పై ఇంటికి వస్తుండగా ఘటన

కొండాపూర్, మార్చి 22 : ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో పదో తరగతి విద్యార్థిని అక్కడికక్కడే మృతిచెందిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై శనివారం చోటుచేసుకున్నది. టీఎన్జీవోకాలనీకి చెందిన పెనుదాస్ ఛత్రియా, సబితా ఛత్రియా దంపతుల కుమార్తె ప్రభాతి ఛత్రియా(16) విజయభారతి స్కూల్లో పదో తరగతి చదివి, పరీక్షలు రాస్తున్నది. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో శనివారం పరీక్ష రాసి సోదరుడు సుమన్ ఛత్రియాతో కలిసి బైక్‌పై బైక్‌పై ఇంటికి వస్తుండగా గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రభాతి ఛత్రియా అక్కడికక్కడే మృతి చెందింది. సుమన్ ఛత్రియాకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ప్రభాతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి.. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పది పరీక్షలకు 1,615 మంది గైర్హాజరు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి వార్షిక పరీక్షలకు శనివారం 99.70శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 1,615 మంది గైర్హాజరయ్యారు. శనివారం రెండో భాష పేపర్‌కు పరీక్షను నిర్వహించగా, 4,97,088 మంది రెగ్యులర్ విద్యార్థులకు 4,95,590 మంది పరీక్షకు హాజరైనట్టు, 1,498 మంది గైర్హాజరైనట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు 226 మందికి 109 మంది హాజరు కాగా, 117మంది గైర్హాజరైనట్టు ఆయన వెల్లడించారు.

రేపటి నుంచి డీఈఈసెట్‌కు దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 22(నమస్తే తెలంగాణ) : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎడ్), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ డీఈఈసెట్-25 నోటిఫికేషన్ విడుదలైంది. 2025-27 విద్యాసంవత్సరానికి రెండేండ్ల వ్యవధి కోర్సుల్లో ప్రవేశాలకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఎస్సీఈఆర్టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. సోమవారం(మార్చి 24) నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు deecet. cdse. telangana.gov.in సంప్రదించాలి.

'పది' పేపర్ లీకేజీ కలకలం

- నల్లగొండలో రెండ్రోజులుగా విచారణ
- ఎస్పీ సీరియస్.. పటిష్ఠ నిఘా
- 11 మంది అరెస్ట్..రహస్య విచారణ
- గోప్యతపై అనుమానాలు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

రామగిరి/ నకిరేకల్, మార్చి 22: నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ తీవ్ర కలకలం రేపుతున్నది. శుక్రవారం రాత్రి 10 గంటలకు మొదలైన విచారణ శనివారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. ఈ అంశాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సీరియస్‌గా తీసుకోవడంతో డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో రహస్యంగా విచారణ చేపడుతున్నారు. పేపర్ లీకేజీతో సంబంధమున్న 11 మందిని అరెస్టు చేసి నల్లగొండ సీసీఎస్‌కు తరలించినా, ఇప్పటి వరకు వివరాలు బయటకు వెల్లడించలేదు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పీ గోపాల్, డీవో రామ్మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేసి షోకాజు నోటీసులు ఇచ్చారు. సమస్యాత్మకంగా మారిన నకిరేకల్‌లో పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయలేదన్న విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.

గోప్యత పాటిస్తున్న అధికారులు

నకిరేకల్ మండల కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షల తొలిరోజు పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. దాంతో పరీక్ష కేంద్రం నూతన సీఎస్‌గా వీరారెడ్డి, డీవోగా జమీల్ బేగమ్‌లను నియమించారు. అదే పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు సుధారాణిని కూడా సస్పెండ్ చేశారు. నకిరేకల్ ఎంఈవో మేక నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నారు. ఒక విద్యార్థి డిబార్ అయినట్టు ఆయన తెలిపారు. కాగా, ప్రశ్నాపత్రం లీకేజీపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు చెంతుతున్నా.. అటు విద్యాశాఖ గాని, ఇటు పోలీస్ అధికారులు గాని ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. డీఈవో భిక్షపతిని వివరణ కోరగా.. పేపర్ లీకేజీ వ్యవహారంపై పోలీసులు లోతైన విచారణ జరుపుతున్నారని, బాధ్యులపై విద్యాశాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీసీలుగా ఇతర జిల్లాలవారు

- ఉన్నతాధికారుల జోక్యం.. ఇద్దరు సీసీలు రిలీవ్
- రంగారెడ్డి జిల్లాలో ఘటన

ఆమనగల్లు, మార్చి 22: నిబంధనలకు విరుద్ధంగా ఇతర జిల్లాల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నవారిని సీసీలుగా నియమించిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం అదే మండలంలో పనిచేస్తున్నవారిని సీసీలుగా నియమించాల్సి ఉంటుంది. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం సీఎస్ శ్రీధర్ .. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్విజిలేటర్‌గా నియమించిన ఆంజనేయులును సీసీగా నియమించుకున్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సీఎస్ ప్రభాకర్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మణిపాల్ రెడ్డిని సీసీగా నియమించుకున్నారు. సీసీల ద్వారా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం డీఈవో సుశీంధర్‌రావుకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కడంతో సీసీలను శుక్రవారం సా యంత్రం రిలీవ్ చేశారు. శనివారం డీఈవో పరీక్ష కేంద్రాలను సందర్శించారు. విచారణ చేస్తున్నామని, చర్యలుంటాయని తెలిపారు.